ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -68 పేజీలు - 05 వెల - 04/- ఆదివారం15 మార్చి 2026

# మాది 'పీపుల్ ఫ్రెండ్లీ' ప్రభుత్వం



## గిరిజనులకు పవన్ కల్యాణ్ భరోసా

మాది పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం... ప్రజల కోసం ఎక్కడికైనా వస్తా: పవన్ కల్యాణ్

గిరిజనుల మధ్య జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్న పవన్ కల్యాణ్

18 నెలల్లో ఏజెన్సీలో 460 కి.మీ. రోడ్ల నిర్మాణం చేపట్టామని వెల్లడి

గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులు మళ్లించిందని ఆరోపణ

గ్రామస్థులు చెప్పిన పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపిన ఉప ముఖ్యమంత్రి






**పాడేరు,మార్చి 14 ఆంధ్ర ప్రగతి**

తమది 'పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం' అని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామం నందిగరువులో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో 'మాట-మంతి' కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "గత ప్రభుత్వంలో కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కూడా ప్రజలు భయపడేవారు.

మిగతా 2లో.

# గ్యాస్ పై ప్రజలు ఆందోళన చెందొద్దు




కొరత సమస్య లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు

మంత్రుల బృందం, ప్రత్యేక అధికారుల బృందాలు నిరంతర పర్యవేక్షణ

కష్టం, నష్టాన్ని తగ్గించేందుకు ముమ్మర ప్రయత్నాలు

సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ, బలోపేతానికి కృషి

వంట గ్యాస్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు

ఆసుపత్రులు, హాస్టళ్ల కార్యకలాపాలకూ ప్రాధాన్యం

రియల్ టైమ్ డేటా విశ్లేషణతో ప్రణాళికాయుత చర్యలు

బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి

రాష్ట్ర మంత్రులు కేశవ్, అచ్చెన్నాయుడు, మనోహర్

**విజయవాడ, మార్చి 14 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, మంత్రుల బృందం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం కానూరులోని పౌర సరఫరాల రాష్ట్ర కార్యాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, వర్చువల్‌గా నాదెండ్ల మనోహర్.. పౌర సరఫరాలు, సమాచార, పౌర సంబంధాలు, పోలీస్, విజిలెన్స్ తదితర సమన్వయ శాఖల అధికారులతో పాటు ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తదితర ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల

మిగతా 2లో.



## భట్టి నివాసంలో ఏపీ సీఎం చంద్రబాబు...

భట్టి కుమారుడు, కోడలిని కలిసి ఆశీర్వదించిన చంద్రబాబు

రాజకీయాలకు అతీతంగా సాగిన ఆత్మీయ పలకరింపు

వివాహానికి హాజరుకాలేకపోవడంతో ఇప్పుడు శుభాకాంక్షలు తెలిపిన ఏపీ సీఎం

## దేశంపై యుద్ధప్రభావం పడకుండా చర్యలు

గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్న కాంగ్రెస్

దేశ ప్రయోజనాలకు భిన్నంగా కాంగ్రెస్ వైఖరి

అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు

**గౌహతి,మార్చి 14 ఆంధ్ర ప్రగతి**

మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా ఏమాత్రం బాధ్యతలేని విపక్షంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని సిల్చార్‌లో శనివారంనాడు పర్యటించారు. రూ.23,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.22,864 కోట్లతో సిల్చార్-మేఘాలయలోని షిల్లాంగ్ మధ్య నిర్మించనున్న యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు భూమి పూజ చేశారు

మిగతా 2లో.



## తమిళ కవి వైరముత్తుకు జ్ఞానపీఠం

అభినందనలు తెలిపిన స్టాలిన్, , కమల్ హాసన్



**చెన్నై,మార్చి 14 ఆంధ్ర ప్రగతి**

సాహితీ పురస్కారాల్లో అత్యున్నతమైన జ్ఞానపీఠ్ పురస్కారానికి 2025వ ఏడాదికిగాను తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు పేరును ఎంపిక కమిటీ శనివారం ప్రకటించింది. ఆయనకు ముఖ్యమంత్రి స్టాలిన్, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ తదితరులు

మిగతా 2లో.

# ఆరని యుద్ధ జ్వాలలు

## ఖర్గ్ దీవిపై అమెరికా దాడి

ఐదు రీఫ్యూయలింగ్ విమానాలను ధ్వంసం చేసిన ఇరాన్

సౌదీపై కొనసాగుతున్న క్షిపణి, డ్రోన్ దాడులు

షరతులకు ఓకే అంటేనే యుద్ధాన్ని ముగిస్తాం : ఇరాన్ రాయబారి

హోర్ముజ్‌ను దాటిన రెండు భారత ఎల్పీజీ ట్యాంకర్లు

మొజ్తాబాను పట్టిస్తే పది మిలియన్ డాలర్లు : అమెరికా ఆఫర్

అమెరికా- ఇజ్రాయిల్ సేనలు సైనిక చర్యలు ప్రారంభించిన తర్వాత ఇవే అత్యంత శక్తివంతమైన బాంబు దాడులని ఆయన తెలిపారు. ఇప్పటి వరకూ ఇరాన్‌లోని సుమారు ఐదు వేల లక్ష్యాలపై దాడులు జరిగినప్పటికీ అమెరికా, ఇజ్రాయిల్ దళాలు ఖర్గ్ దీవి వైపు చూడలేదు. ప్రస్తుతానికి దీవిలోని చమురు మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోలేదని ట్రంప్ చెప్పారు. అయితే హర్మూజ్ జలసంధిలో చమురు నౌకల ప్రయాణానికి ఇరాన్ కానీ, వేరెవరైనా కానీ ఆటంకం కలిగిస్తే తాను కూడా తన నిర్ణయాన్ని పునఃపరిశీలించుకుంటానని హెచ్చరించారు.

మిగతా 2లో.





## సర్వేయర్లపై సస్పెన్షన్ల ఎత్తివేత

56 మందిని విధుల్లోకి తీసుకుంటూ ఉత్తర్వులు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి

**అమరావతి, మార్చి 14 ఆంధ్ర ప్రగతి**

సర్వే శాఖలో అధికారులు సృష్టించిన కల్లోలం సద్దుమణిగింది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ జోక్యంతో 56 మంది సర్వేయర్లపై విధించిన సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది.

మిగతా 2లో.

## పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్‌కు స్వేచ్ఛ

నిర్బంధాన్ని రద్దు చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు



2లో.

## ప్రజల సొమ్ము దోచుకుంటామంటే ఊరుకోం

డీపీఆర్ లేకుండా ప్రజల ఇండ్లకు మార్కింగ్ ఎట్లా ఇస్తారు

బఫర్ జోన్ పేరుతో పేదలను తరిమికొడుతున్నారు

సీఎం రేవంత్‌రెడ్డి మాటల విలువ జీరో

కాంగ్రెస్‌కు కూల్చడం తప్పా నిర్మాణం తెలియదు

మూసీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో కేటీఆర్




2లో.

# తమిళ కవి వైరముత్తుకు జ్ఞానపీఠం

**మొదటిపేజీ తరువాయి**

తమ 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తేని జిల్లా మేట్టూర్‌లో 1953లో జన్మించిన వైరముత్తు కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు రాసిన 'వైకరై మేఘంగళ్' కవితా సంకలనం అప్పట్లోనే ఓ మహిళా కళాశాలకు పాఠ్యాంశంగా మారింది. తమిళనాడు ప్రభుత్వ అధికారిక భాషా కమిషన్‌లో పని చేస్తున్నప్పుడే 1980లో దర్శక దిగ్గజం భారతీరాజా తెరకెక్కించిన 'నిళల్గళ్' చిత్రం ద్వారా సినీ గేయరచయితగా తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు. కవితలు, నవలలు తదితర సుమారు 40 పుస్తకాలు, సినిమాలో సుమారు 7,500 పాటలు రాశారు. ఇప్పటికే ఆయన సాహిత్య అకాడమీ, సాధన సమ్మాన్, పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ గేయ రచయితగా 7 సార్లు జాతీయ పురస్కారాలు అందుకున్న ఏకైక రచయిత ఆయన మాత్రమే. ఉత్తమ గేయ రచయితగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 6 సార్లు పురస్కారాలు అందుకున్నారు. జ్ఞానపీఠ్ పురస్కారాన్ని ఇప్పటికే రాష్ట్రానికి చెందిన అఖిలన్ (1975), జయకాంతన్ (2002) అందుకోవడం గమనార్హం. జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపికైన వైరముత్తుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అభినందనలు తెలిపారు. 'తన కవితా పటిమతో తమిళ భాషను శాసిస్తున్న 'కవిపేరరసు' (కవి సామ్రాట్) వైరముత్తుకు జ్ఞానపీఠ్ పురస్కారం దక్కింది. ఈ రోజే నేను వైరముత్తును కలిసి మాట్లాడాను. ఆ భేటీ ముగిసిన కొద్దిసేపటికే ఈ తీపి కబురు రావడం ఆ సంతోషాన్ని మరింత రెట్టింపు చేసింది' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.ఽ

# దేశంపై యుద్ధప్రభావం పడకుండా చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, అస్సాం ప్రజలను హింస, ఉగ్రవాదం వైపు కాంగ్రెస్ తప్పుదారి పట్టించిందని, అయితే ఇవాళ రాష్ట్రంలో సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. దేశ ప్రజలపై ఆ ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. వారి రక్షణ, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆశిస్తాం. అయితే దేశ ప్రయోజనాల పరిరక్షణలో కాంగ్రెస్ మరోసారి విఫలమైందని విమర్శించారు. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది. అంతర్జాతీయంగా భారత్ శీఘ్ర అభివృద్ధిని సాధించడం కొన్ని శక్తులకు ఇష్టంలేదు. అలాంటి శక్తుల చేతిలో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిందని మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి అస్సాం గురించి కానీ, దేశం గురించి కానీ ఎలాంటి విజన్ లేదని మోదీ తప్పుపట్టారు. మోదీని దూషించడం, అబద్దాలు, వదంతుల ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించడమే ఆ పార్టీకి తెలుసునని అన్నారు. బీజేపీ ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే తమ పని ప్రారంభమవుతుందని, అభివృద్ధిలో వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడమే బీజేపీ ప్రధాన మంత్రమని చెప్పారు. మీరు కాంగ్రెస్‌ను ఇక్కడినుంచి ఎప్పుడో తరిమికొట్టారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లోనూ ప్రతి రాష్ట్రం ఆ పార్టీకి గుణపాఠం చెప్పనుంద న్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసనలు తెలపడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. మొత్తం దేశం ఈ చర్యను ఖండించిందన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ దేశం పైనే దాడికి దిగిందన్నారు. నిరాశతో దుస్తులు చింపుకోవడం తప్ప.. వాళ్లకి మరేమీ మిగల్లేదని ఎద్దేవా చేశారు.

# భట్టి నివాసంలో ఏపీ సీఎం చంద్రబాబు...

**భట్టి కుమారుడు, కోడలిని కలిసి ఆశీర్వదించిన చంద్రబాబు**

**రాజకీయాలకు అతీతంగా సాగిన ఆత్మీయ పలకరింపు**

**వివాహానికి హాజరుకాలేకపోవడంతో ఇప్పుడు శుభాకాంక్షలు తెలిపిన ఏపీ సీఎం**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం హైదరాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నివాసానికి వెళ్లారు. ఇటీవల వివాహం చేసుకున్న భట్టి కుమారుడు సూర్య విక్రమాదిత్య, కోడలు సాక్షిలను ఆశీర్వదించేందుకు చంద్రబాబు ఆయన ఇంటికి చేరుకున్నారు.చంద్రబాబుకు భట్టి విక్రమార్క సాదర స్వాగతం పలికారు. అనంతరం నూతన దంపతులను కలిసిన చంద్రబాబు, వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కాసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.ఇటీవల భట్టి విక్రమార్క తన కుమారుడి వివాహానికి చంద్రబాబును ఆహ్వానించేందుకు స్వయంగా అమరావతికి వెళ్లారు. అయితే, అప్పటి పనుల ఒత్తిడి కారణంగా చంద్రబాబు వివాహ వేడుకకు హాజరు కాలేకపోయారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పర్యటనలో భాగంగా భట్టి ఇంటికి వెళ్లి నూతన దంపతులకు విషెస్ తెలియజేశారు.మార్చి 5న శంషాబాద్ జీఎంఆర్ ఎరీనాలో జరిగిన ఈ వివాహ వేడుకకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సినీనటుడు చిరంజీవి వంటి పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరైన విషయం తెలిసిందే.

## పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్‌కు స్వేచ్ఛ నిర్బంధాన్ని రద్దు చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు

**న్యూఢిల్లీ,మార్చి 14 ఆంధ్ర ప్రగతి:** పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ నిర్బంధాన్ని రద్దు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ప్రకటన విడుదల చేసింది. దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన జైలు నుంచి విడుదల కానున్నారు. లద్దాఖ్ కు రాష్ట్ర హోదా డిమాండ్ చేస్తూ గతేడాది లేహ్ ప్రాంతంలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడ్డారు. ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే ఈ ఆందోళనలు జరిగాయని కేంద్రం వెల్లడించింది. ఈ క్రమంలోనే జాతీయ భద్రత చట్టం కింద అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. శాంతి భద్రతలను కాపాడాలనే ఉద్దేశంతో కస్టడీలోకి తీసుకున్నట్లు హోంశాఖ ప్రకటనలో వెల్లడించింది. లద్దాఖ్‌లో శాంతికి కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. ఈ క్రమంలో వాంగ్‌చుక్ నిర్బంధాన్ని తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొంది. అయితే, ప్రస్తుతం కొనసాగుతున్న బంద్‌లు, నిరసనల వాతావరణం శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నాయని అభిప్రాయపడింది.

# సర్వేయర్లపై సస్పెన్షన్ల ఎత్తివేత

**మొదటిపేజీ తరువాయి**

వారిపై క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించింది. 28 జిల్లాల గ్రామ సర్వేయర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను విధుల్లోకి తీసుకుంటూ సర్వే, సెటిల్‌మెంట్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు, ఇతర సిబ్బందితో సమానంగా తమకు బేసిక్ పే రూ.30వేలకు పెంచాలని, గేడ్-1 పదోన్నతులు, టెక్నికల్ అలవెన్సులు ఇవ్వాలని, రీసర్వే విధుల నిర్వహణకు ల్యాప్‌టాప్, రోవర్లు, ఇతర సామగ్రి అందించాలని, బకాయిలు చెల్లించాలని కోరుతూ సర్వేయర్లు గత కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. ఈ డిమాండ్లపై సమ్మె చేయాలని నిర్ణయించారు. వారితో చర్చలు జరిపి ఆందోళన విరమింపజేయాల్సిన రెవెన్యూ, సర్వే శాఖల ఉన్నతాధికారులు కన్నెర్ర చేశారు. మంత్రికి మాట మాత్రం చెప్పకుండా నిర్ణయాలు తీసుకొన్నారు. ఆందోళనలో ఉన్న సర్వేయర్ల సంఘం జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు 56 మందిని సస్పెండ్ చేశారు. తనకు తెలియకుండా ఇంత పెద్ద నిర్ణయం ఎందుకు తీసుకున్నారంటూ అధికారులపై మంత్రి సీరియస్ అయ్యారు. గత మంగళవారం సర్వేయర్ల సంఘం ప్రతినిధులను అమరావతికి పిలిపించి చర్చలు జరిపారు. అనంతరం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్, భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ జయలక్ష్మితో అనగాని సమావేశమయ్యారు.

# ఆరని యుద్ధ జ్వాలలు

**మొదటిపేజీ తరువాయి**

ఆర్థిక-చమురు ఆదాయాలకు కీలకం

ఖర్గ్ దీవిని ఇరాన్‌కు చెందిన అత్యంత కీలక ఆర్థిక లక్ష్యంగా భావిస్తారు. ఇరాన్ ఆర్థిక, చమురు ఆదాయాలలో ఈ దీవి ప్రధాన పాత్ర పోషిస్తోంది. అక్కడ పెద్ద ఎత్తున చమురు నిల్వలు ఉన్నాయి. ఖర్గ్ దీవి నుంచి పైప్‌లైన్లు నిర్మించి ఇరాన్‌లోని అతి పెద్ద చమురు, గ్యాస్ క్షేత్రాలతో అనుసంధానించారు. ఈ దీవి ద్వారా ఏటా 950 మిలియన్ బ్యారల్స్ ముడి చమురు రవాణా అవుతోంది. ఖర్గ్‌లో ట్యాం కర్లు చమురును నింపుకొని భారత్, చైనా వంటి ఆసియా మార్కెట్లకు చేరవేస్తుంటాయి. దీవిలోని చమురు మౌలిక సదుపాయాలపై బాంబు దాడులు జరిగితే ఇరాన్ నుంచి జరిగే రోజువారీ ముడి చమురు ఎగుమతులలో 90 శాతం నిలిచిపోతాయి. ఫలితంగా చమురు ధరలు అందుబాటులో లేకుండా పోతాయి.

2024లో చమురు అమ్మకాల ద్వారా ఇరాన్ రూ.7.2లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇందులో ఎక్కువ భాగం ఖర్గ్ నుంచి ముడి చమురు విక్రయం ద్వారా లభించిందే. అందుకే ఇప్పటి వరకూ అమెరికా, ఇజ్రాయిల్ సేనలు ఆ దీవి వైపు చూడలేదు. తాజా దాడిలో చమురు మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం వాటిల్లనప్పటికీ బ్యారల్ ముడిచమురు ధరలు 150 డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇరాన్‌కు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉన్న ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకునే అవకాశాలపై శ్వేతసౌధంలో ఇటీవల అమెరికా అధికారులు సమాలోచనలు జరిపారు. ఖర్గ్ దీవిపై జరిగిన దాడి నేపథ్యంలో యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ప్రతీకారం తప్పదు : ఇరాన్

అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని, దెబ్బకు దెబ్బ తీస్తామని ఇరాన్ ప్రకటించింది. అత్యాధునిక ఆయుధాలతో శత్రువులపై దాడి చేస్తామని తెలిపింది. ఇరాన్ దాడుల కారణంగా అమెరికా వాయు సేనకు భారీ నష్టం జరిగింది. సౌదీ అరేబియాలోని అమెరికా వైమానిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో అమెరికాకు చెందిన ఐదు రీఫ్యూయలింగ్ విమానాలు ధ్వంసమయ్యాయి. అమెరికా అధికారులను ఉటంకిస్తూ వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక ఈ విషయాన్ని తెలియజేసింది. సౌదీ అరేబియాలోని అమెరికా వైమానిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిలో ఐదు కేసీ-135 రీఫ్యూయలింగ్ విమానాల ట్యాంకర్లు దెబ్బతిన్నాయని ఆ పత్రిక చెప్పింది. తమ దేశంపై ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగిస్తోందని బహ్ రైన్ తెలిపింది. ఇప్పటి వరకూ ఇరాన్ నుంచి 124 క్షిపణులు, 203 డ్రోన్లు వచ్చి పడ్డాయని చెప్పింది.

ఎల్పీజీ ట్యాంకర్లకు గ్రీన్‌సిగ్నల్

హర్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణించేందుకు భారత్‌కు చెందిన రెండు ఎల్పీజీ ట్యాంకర్లను ఇరాన్ అనుమతించింది. దీంతో భారత పతాకం ఉన్న శివాలిక్, నందాదేవి అనే రెండు ఇంధన నౌకలు శనివారం హర్మూజ్ జలసంధిని దాటాయి. జలసంధిలో భారత్ జెండాలున్న 28 నౌకలు చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. శివాలిక్ నౌకలో 40,000 మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉంది. నందాదేవిలో కూడా భారీ పరిమాణంలో గ్యాస్ రవాణా అవుతోంది.

# మాది 'పీపుల్ ఫ్రెండ్లీ' ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి**

కానీ ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగమే మీ గడప వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకునేలా పాలనను ప్రక్షాళన చేశాం. మీరు కష్టాలు చెప్పుకోవడానికి రోడ్ల మీదకు రాకముందే వాటిని పరిష్కరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని భరోసా ఇచ్చారు.

గత ప్రభుత్వం నిధులు మళ్లించడం వల్లే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని పవన్ కల్యాణ్ ఆరోపించారు. "జలజీవన్ మిషన్ పథకంలో రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఏజెన్సీ గ్రామాల్లో 460 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాం. గిరి శిఖర గ్రామాల్లో గర్భిణీలు పడుతున్న డోలీ కష్టాలు ఇక కనిపించకూడదన్నదే మా లక్ష్యం" అని వివరించారు. కేవలం 40 గడపలున్న నందిగరువు గ్రామానికి రూ.2 కోట్లతో రోడ్డు నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు.



జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని లక్షలాది మంది మధ్య కాకుండా, 70 ఏళ్లుగా రోడ్డుకు నోచుకోని మారుమూల గిరిజన గ్రామంలో జరుపుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పవన్ అన్నారు. "ఈ ప్రాంతంలో కూటమి అభ్యర్థులు గెలవకపోయినా మేము ఎక్కడా వివక్ష చూపించం. మీరు ఓట్లు వేశారా లేదా అని చూడకుండా, మీరు బాగుండాలనే పనిచేస్తాం. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ఇలాంటి ప్రాంతాలకు రావడానికి నాయకులు భయపడతారేమో కానీ, ప్రజల కోసం పనిచేసే నాకు ఎలాంటి భయాలు లేవు" అని స్పష్టం చేశారు.

'మాట-మంతి'లో భాగంగా గ్రామస్థులు ప్రస్తావించిన పలు సమస్యలకు పవన్ కల్యాణ్ అక్కడికక్కడే పరిష్కారాలు చూపారు. ఓనూరు పాఠశాల మరమ్మతులు, కొత్తపాలెం గ్రామానికి 1.6 కి.మీ. రోడ్డు మంజూరు, అసంపూర్తిగా ఉన్న పాఠశాల, అంగన్‌వాడీ భవనాల పూర్తికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లకుండా అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# గ్యాస్ పై ప్రజలు ఆందోళన చెందొద్దు

**మొదటిపేజీ తరువాయి**

ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌పీజీ రోజువారీ అవసరాలు, సరఫరా స్థితిగతులతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. రియల్ టైమ్ డేటా విశ్లేషణ ఆధారంగా పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గౌరవ ప్రధాని నేతృత్వంలో కేంద్రం, గౌరవ సీఎం నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రుల బృందంతో పాటు అధికారుల బృందాలు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తూ భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. వదంతులు నమ్మవద్దని కోరారు. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం కారణంగా, నౌకల రవాణాకు ఆటంకం వల్ల సరఫరా వ్యవస్థలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని.. అయితే వ్యవస్థల పునరుద్ధరణకు, బలోపేతానికి, కొత్త మార్గాల అన్వేషణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కేంద్రం మార్గదర్శకాలతో రాష్ట్ర స్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇతర పెట్రోలియం ఉత్పత్తులను తగ్గించి, గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్రం దేశవ్యాప్త రి÷నైరీలను ఆదేశించిందని, దీనివల్ల ఉత్పత్తి 10 శాతం నుంచి 20 శాతం వరకు పెరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా కుటుంబాలపై ప్రభావం పడకుండా వంట గ్యాస్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. ఆసుపత్రులు, వసతిగృహాల కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్యాస్ సిలిండర్లపై కేంద్రం కొన్ని పరిమితులు విధించిందని.. ప్రస్తుతానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు, డబుల్ సిలిండర్లు ఉన్నవారికి 32 రోజులకు సిలిండర్ పొందేలా మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. అనవసరంగా ఆందోళనకు గురికావద్దని, కష్టాన్ని, నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు:విపత్కర పరిస్థితులను లాభార్జన కోసం ఉపయోగించుకోవాలనే తలంపుతో ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గౌరవ సీఎం ఆదేశాలతో ప్రత్యామ్నాయాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే హోటళ్లు, గ్యాస్ డీలర్లు తదితర అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విపత్కర కాలంలో వివిధ రకాల వినూత్న ఆప్షన్లను ముందుకు తీసుకొస్తున్నారన్నారు. ప్రజల సలహాలు, సూచనలను కూడా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 95 శాతం ఆన్‌లైన్ బుకింగ్‌లు జరుగుతున్నాయని, 88 శాతం వరకు ఓటీపీ ఆధారిత గ్యాస్ సిలిండర్ల డెలివరీలు జరగుతున్నాయని.. ఈ శాతాన్ని పెంచాలని సంస్థలకు సూచించామన్నారు. ఆర్‌టీజీఎస్ తో పాటు కలెక్టర్ల కార్యాలయాల్లోనూ ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ వనరులను ఉపయోగించు కోవడంలో భాగంగా పైప్డ్ గ్యాస్‌పైనా ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్ల మంత్రి తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి దార్శనికతతో విజయవాడతో పాటు వివిధ నగరాల్లో విజయవంతంగా నడుస్తున్న పైప్డ్ గ్యాస్ నేడు వరంగా మారాయని పేర్కొన్నారు. నేచురల్ గ్యాస్‌ను సమర్థవంతంగా వినియోగించుకునే విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే దృష్టిసారించినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, డైరెక్టర్ శ్రీవాస్ నుపుర్ అజయ్‌కుమార్, సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్, సమన్వయ శాఖల ఉన్నతాధికారులు, చమురు సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సొమ్ము దోచుకుంటామంటే ఊరుకోం

## మూసీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో కేటీఆర్

రంగారెడ్డి **మార్చి 14 ఆంధ్ర ప్రగతి**

మూసీ సుందరీకరణకు, అభివృద్ధికి తాము ఏమాత్రం వ్యతిరేకం కాదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్షల కోట్ల అవినీతి ప్రణాళికలకు వ్యతిరేకమని, కచ్చితంగా అవినీతిని అడ్డుకుంటామని తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా రాజేందర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని హిమాయత్‌సాగర్ ప్రాంతంలో 'మూసీ పునరుజ్జీవం-పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్' అనే కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ రాజేందర్‌నగర్ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భం గా కేటీఆర్ మాట్లాడారు.. పేదల భూముల విలువ ' జీరో ' అంటున్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు విలువ లేదని అన్నారు. పేదల భూముల విలువ రూ. లక్షా 50 వేల కోట్లని, ఆ విలువైన భూములపై కన్నేసిన ముఖ్యమంత్రి .. మూసీ ప్రణాళికను తెరపైకి తెచ్చారని ఆరోపించారు.

'రాష్ట్ర ప్రభుత్వం బఫర్ జోన్ పేరు చెప్పి ప్రజలను భయపెట్టి వారి ఇండ్లను కూలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సొంత ఇల్లు రెడ్డి కుంట బఫర్ జోన్‌లో ఉన్నది నిజం కాదా, దాని గురించి ఎందుకు మాట్లాడటం లేదు. సీఎం సోదరుడి ఇల్లు హైదరాబాద్‌లో బఫర్ జోన్‌లో ఉంది. మంత్రుల ఫామ్‌హౌస్‌లు, ఇండ్లు కూడా బఫర్ జోన్‌లో ఉన్నాయి. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు' అని కేటీఆర్ ప్రశ్నించారు. 20ఏండ్ల కింద కట్టుకున్న అపార్ట్‌మెంట్లను, ఇండ్లను కూలగొడతా అంటున్న ముఖ్యమంత్రి ఇప్పుడు మూసీ బఫర్ జోన్‌లో కడుతున్న రియల్ ఎస్టేట్ సంస్థల అపార్ట్‌మెంట్‌లను మాత్రం ముట్టుకోను అనడంలో అర్థం ఏంటనీ ప్రశ్నించారు.

ఒకటి, రెండు అపార్ట్‌మెంట్ వాసులకు ఇండ్లు కట్టించి తగిన స్థలం ఇస్తామని చెబుతున్న రేవంత్‌రెడ్డి, అదే సూత్రం అదే న్యాయం బాధితులందరికీ వర్తింపజేస్తారా అనే ప్రశ్నకు సమా ధానం చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డికి తమ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిన 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన పరిహారం ఎంతో అనే అంశంపై అవగాహన కూడా లేదన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం రూ.16వేల కోట్లతో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీని అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఎలాంటి డీటెయిల్స్ ప్లానింగ్ రిపోర్టు (డీపీఆర్) లేకుండా సోషల్ ఇంఫాక్ట్ స్టడీ, ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ స్టడీ వంటి నివేదికలు, ప్రజలతో ఎలాంటి చర్చలు లేకుండా ఇండ్లను కూలగొడతామని భయాందోళనకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వంలో కేసీఆర్ పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా నదుల నీటి వినియోగం ప్రాజెక్టుల నిర్మాణం గురించి వివరిస్తే, రేవంత్‌రెడ్డి పీపీటీ ద్వారా ఎవరి ఇల్లు ఎట్లా కూలగొట్టాలి, ఎవరి భూములు ఎట్లా లాక్కోవాలి.. అనే విధ్వంసం గురించి పీపీటీ ఇచ్చార న్నారు. వందల కిలోమీటర్ల నమోమి గంగాకి ఖర్చు కేవలం రూ.42 వేల కోట్లు అయితే, 55 కిలోమీటర్ల మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఎందుకు ఖర్చువుతుందనే ప్రశ్నకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వివేకానందగౌడ్, సబితా ఇంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, శాసనమండలి మాజీ చైర్మెన్ స్వామి గౌడ్, పార్టీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో రెండు రోజుల టీవీ టెక్నీషియన్ శిక్షణా శిబిరం ప్రారంభం.

**ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయ సహకారంతో.శిక్షణ శిబిరం ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణారెడ్డి ,డాక్టర్ రవి కృష్ణ.**

**టీవీ టెక్నీషియన్స్ సద్వినియోగం చేసుకోవాలి: మధుసూదన రెడ్డి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్, టీవీ టెక్నీషియన్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు.**

**నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ నిర్వహణలో.శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న నిపుణులు సయ్యద్ ఇక్బాల్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 14:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్, టీవీ టెక్నీషియన్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో, అమరావతి ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయ సహకారంతో,నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ నిర్వహణలో శనివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా టివి టెక్నీషియన్లకు రెండు రోజుల సాంకేతిక శిక్షణా తరగతుల శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎలక్ట్రానిక్, టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న నిపుణులు సయ్యద్ ఇక్బాల్ అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజలను చేసి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ముందుగా టీవీ ని కనుగొన్న బైర్డ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ టీవీ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను తెలుసుకోవడం ద్వారా తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి టీవీ టెక్నీషియన్ కి ఇది గొప్ప అవకాశం అన్నారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక నైపుణ్య శిక్షణ పొంది టీవీలు రిపేర్ కి వచ్చినప్పుడు లోపం ఎక్కడుందో సరిగా గుర్తించి, సత్వరమే తయారు చేసి ఇవ్వడం ద్వారా టెక్నీషియన్స్ పై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందన్నారు. టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యుల కుటుంబాలకు మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహిస్తామని, వారి సంక్షేమానికి, అభివృద్ధికి స్థానిక మంత్రివర్యులు ఎన్.ఎం.డి.ఫరూక్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ సహకారం అందేలా కృషి చేస్తామన్నారు. టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన రెడ్డి, నంద్యాల జిల్లా సంఘం అధ్యక్షులు కన్నయ్య మాట్లాడుతూ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ముందుగా కర్నూలు, నంద్యాల జిల్లాలలో ప్రారంభించడం సంతోషకరమన్నారు.
శిక్షణ ఇస్తున్న సాంకేతిక నిపుణులు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ టెలివిజన్ లు ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికతతో రూపాంతరం చెందుతున్నాయని తదనుగుణంగా వాటి గురించి అవగాహన పెంచుకోవడం ప్రతి టీవీ టెక్నీషియన్ కి ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి,శిక్షణ ఇస్తున్న సాంకేతిక నిపుణులు సయ్యద్ ఇక్బాల్,రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి రామకృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ సంఘం అధ్యక్షులు కన్నయ్య, నంద్యాల టౌన్ సంఘం అధ్యక్షులు జయపాల్,ఆడియో విజువల్ సాంకేతిక నిపుణులు వెంకటేశ్వర రెడ్డి,ఎస్.ఆర్.ఎం. విశ్వవిద్యాలయ ప్రతినిధి సాగర్, సందీప్, శివ యాదవ్, వీరా రెడ్డి, రహీమ్ బైగ్, ఎల్లా గౌడ్ , , జిల్లా నలుమూలల నుండి వచ్చిన రెండు వందల మంది పైగా టీవీ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# మార్చి 15న జరిగే ఫ్లానా పరీక్షను విజయవంతంగా నిర్వహించాలి.

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 14:**
అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా మార్చి 15న నిర్వహించబడనున్న "ప్రాథమిక చదువు మరియు సంఖ్యా నైపుణ్యాల అంచనా పరీక్ష" ను జిల్లావ్యాప్తంగా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా మరియు మండల స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,62,235 మంది అభ్యాసకులను ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేసినట్లు తెలిపారు. వీరి కోసం జిల్లాలో 1,368 పరీక్షా కేంద్రాలను గుర్తించగా, ప్రాథమిక పాఠశాలలు మరియు అంగన్వాడీ కేంద్రాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి కేంద్రంలో ఇన్విజిలేటర్లుగా అంగన్వాడీ టీచర్లు మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను నియమించినట్లు వెల్లడించారు. ఈ పరీక్ష మార్చి 15న ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00




గంటల వరకు నిర్వహించబడుతుందని, అభ్యాసకులు తమకు అనుకూలమైన సమయంలో పరీక్షకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీటి సదుపాయం, శానిటేషన్ వంటి మౌలిక వసతులను తప్పనిసరిగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. పొదుపు సంఘాలు, శ్రామిక సంఘాల ద్వారా ప్రతి అభ్యసకునికి పరీక్షపై విస్తృతంగా అవగాహన కల్పించి, అందరూ తప్పనిసరిగా పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవోలు, ఏపీఎంలు మరియు ఇతర సంబంధిత అధికారులు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్ష అనంతరం సమాధాన పత్రాలను సరిచేసి అవార్డ్ షీట్లలో మార్కులు నమోదు చేసి, వాటిని వెల్ఫేర్ అసిస్టెంట్లకు అందజేసి సంబంధిత యాప్‌లో అప్లోడ్ చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. పరీక్షలో చదవడం, రాయడం, లెక్కలు అనే మూడు విభాగాల్లో ప్రతి ఒక్కటికి 50 మార్కులు చొప్పున మొత్తం 150 మార్కులు ఉంటాయని తెలిపారు. ప్రతి విభాగంలో కనీసం 17 మార్కులు సాధించిన అభ్యాసకులను ఉత్తీర్ణులుగా పరిగణిస్తారని, అదనంగా 5 గ్రేస్ మార్కులు కూడా వర్తిస్తాయని వివరించారు. అన్ని మండలాలకు నియమించిన స్పెషల్ ఆఫీసర్లు మార్చి 15న ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు తమ మండలాల్లో ఉండి పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తూ, అభ్యసకులు అందరూ పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్, జడ్పీ సీఈఓ, డీఆర్డీఏ పీడీ, ఎస్ ఈ ఆర్ పి పీడీ, మెప్మా పీడీ, ఐసీడీఎస్ పీడీ, డీఈఓ, డిప్యూటీ సీఈఓ, డీపీఓ, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఏపీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సీఎంఎంలు మరియు వయోజన విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజంలో మార్పు కోసం పుట్టిన పార్టీ జనసేన.!

**..సినిమాల్లో కాదు,నిజజీవితంలో ప్రజలకోసం నిలబడిన నాయకుడు పవన్ కళ్యాణ్.**

**...విలువలతో కూడిన సేవచేసే రాజకీయ పార్టీ. -...ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 14:**
ప్రజలకోసం,సమాజంలో మార్పుకోసం పుట్టిన పార్టీ జనసేన పార్టీ,కేవలం సినీ ప్రపంచంలో కాకుండా నిజజీవితంలో సైతం ప్రజల సేవ కోసం ఆర్తపడే నాయకుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని నంద్యాల జనసేన నాయకులు భవనాసి శ్రీనివాసులు ( వాసు ) పేర్కొన్నారు.నంద్యాల పట్టణం పద్మావతి నగర్ లోని జనసేన పార్టీ కార్యాలయం లో జనసేన నాయకులు భవనాసి వాసు ఆధ్వర్యంలో జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా జెండాను ఆవిష్కరించి ,జన సైనికులు,వీర మహిళల సమక్షంలో భారీ కేకు కట్ చేశారు.అంతకు ముందు సి ప్రథమ నందీశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి,పరివర్తన లైఫ్ సెంటర్ లో విద్యార్థులకు అన్నదానం చేశారు.అనంతరం ఏర్పాటుచేసిన సమావేశములో భవనాసి శ్రీనివాసులు ( వాసు ) మాట్లాడుతూ జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు .ప్రజలకోసం, సమాజంలో మార్పు కోసం జనసేన పార్టీ ఉద్భవించిందన్నారు.ప్రజల సమస్యలు,రైతు సమస్యలు,యువత ఆశయాలు తో పాటు ప్రజల శ్రేయస్సుకోసం ప్రత్యామ్నాయ పార్టీ నీ పవన్ కళ్యాణ్ తీసుకొచ్చి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. సినిమాలోనే కాకుండా నిజజీవితంలో సైతం ప్రజలకోసం నిలబడి ప్రజల నాయకుడిగా ఆదరణ






పొందుతున్నారన్నారు.ఆయన చెప్పిన మాటలు ప్రతి ఒక్కరు పాటిస్తున్నామన్నారు. రాజకీయాలు పదవులకోసం కాదు సేవ కోసం అని నిరూపించారన్నారు.జనసేన పార్టీ పెట్టీ న 13 ఏళ్లలో ఎన్నో అవమానాలు పడినా ,కార్యకర్తల కష్టాలను కళ్ళారా చూసి జనసేన పార్టీ నీ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారన్నారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలు, సిద్ధాంతాలు ముందుకు తీసుకొని పోతామన్నారు.జనసేన ఉద్యమి కార్యక్రమం ఈ నెల 17 వరకు కొనసాగుతుందని,ఇంకా ఎవరైనా మెంబర్ షిప్ తీసుకొని వారికి మంచి అవకాశం అన్నారు. మారాసు గురు బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ సేవా భావాలు ప్రజల్లోకి తీసుకొని వెళ్ళడమే మా లక్ష్యం అన్నారు.జనసేన పార్టీ ఉద్యమీ ఫిబ్రవరి 16 న మొదలు పెట్టామని మార్చి 10 వరకు ఉండేదని అభిమానుల కోరిక మేరకు మార్చి 17 వరకు కొనసాగుతుందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి జనసేన పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. పిఠాపురం లో ఆయనకు వచ్చే జీతం సైతం పేద ప్రజలకు అందించిన మహనీయుడన్నారు. రోడ్లు,పల్లె బాట,అడవి తల్లి బాట తో ముందుకు సాగుతున్నారన్నారు.దండు మురళి మాట్లాడుతూ దేశంలో కనివిని ఎరుగని రీతిలో రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు.ఎన్నికల్లో పోటీ చేసిన స్థానాల్లో నూటికి నూరు శాతం విజయం సాధించిన పార్టీ ఒక్క జనసేన పార్టీ అని గుర్తు చేశారు.ప్రజాసేవలో పవన్ కళ్యాణ్ ముందుకు సాగిపోతున్నారని అన్నారు.జన సైనికులు సంస్థాగత ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ,మరో సారి చరిత్ర సృష్టిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.రాము మాట్లాడుతుకుల మతాలకు అతీతంగా, భాషలను గౌరవించడం, సంస్కృతి, సంప్రదాయాలు కాపాడడం,అవినీతి పై రాజీలేని పోరాటం,పర్యావరణ ,పరిరక్షణ, అభివృద్ధి, ప్రత్యతని విస్మరించి జాతీయ వాదం , విలువలతో కూడిన రాజకీయం చేయడమే జన సేన పార్టీ లక్షం అన్నారు.ప్రజలు ఇచ్చిన బాధ్యతను విస్మరించకుండా అభివృద్యే ద్యేయంగా చేస్తున్నారని అన్నారు.రాజకీయాల్లో జవాబుదారీ తనంగా స్పందించే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు.అనంతరం జనసైనికులకు, విరమహీళలకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు ,అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయవంతంగా కొనసాగుతున్న ఎముకలు, కీళ్ల ఉచిత వైద్య శిబిరం.

**జి.ఎస్.ఆర్. ఆసుపత్రిలో గత నెల 18వ తేదీ నుండి ఎముకలు, కీళ్ల ఉచిత ఓ.పి.డి. సేవలు అందిస్తున్న డాక్టర్ మహమ్మద్ రఫీ.**

**రంజాన్ మాసం పురస్కరించుకుని నెల రోజుల ఉచిత సేవలు.**

**ఈనెల 20వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుంది: డాక్టర్ మహమ్మద్ రఫీ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 14:** నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో, పద్మావతి నగర్ మెయిన్ రోడ్డు లో ఉన్న జి ఎస్ ఆర్ ఆసుపత్రిలో ప్రముఖ ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్స నిపుణులు, నంద్యాల ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ రంజాన్ మాసం పురస్కరించుకుని గత నెల 18వ తేదీన ప్రారంభమైన ఉచిత ఎముకలు, కీళ్ల ఓ.పి.డి. చికిత్సలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు గత 24 రోజులలో 18 వందల మందికి ఉచితంగా ఓ.పి. వైద్య సేవలు డాక్టర్ మహమ్మద్ రఫీ అందించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన 40 మంది అర్హత కలిగిన రోగులకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఆపరేషన్లు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు ఈ ఉచిత సేవలు కొనసాగిస్తామని తెలిపారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవి కృష్ణ,రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్,రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి,డాక్టర్ అనిల్ కుమార్,డాక్టర్ విజయభాస్కర రెడ్డి,ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్,మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ డాక్టర్ మహమ్మద్ రఫీ నెల రోజులు పైగా ఉచిత వైద్య సేవలు అందించడం ప్రశంసనీయం, స్ఫూర్తిదాయకం అన్నారు.

## అంకాలమ్మ తల్లి తిరుణాలకు మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు ఆహ్వానం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 14:**
గోస్పాడు మండలం, సాంబవరం గ్రామంలో వెలసియున్న శ్రీ అంకాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవ ఆహ్వాన పత్రికను నంద్యాల మంత్రి క్యాంపు కార్యాలయం నందు రాష్ట్ర మైనారిటీ మరియు న్యాయశాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారికి సాంబవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు శనివారం అందజేశారు.



ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామంలో శ్రీ అంకాలమ్మ తల్లి తిరుణాల మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని. పండుగ రోజున ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన "ఎద్దుల బల ప్రదర్శన" (బండ లాగుడు పోటీలను) ప్రారంభించవలసిందిగా మంత్రి ఫరూక్ గారిని సాంబవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గోస్పాడు మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వర్ రెడ్డి , సాంబవరం గ్రామ మాజీ సర్పంచ్ జూపల్లి రామగోపాల్ రెడ్డి , టిడిపి నాయకులు జూపల్లి రామ భూపాల్ రెడ్డి ,జూపల్లి వెంకటరమణారెడ్డి , వాల్మీకి సంఘం సభ్యులు ఎస్ ఆదినారాయణ ,గోపవరం చంద్రుడు ,ఎం వెంకటయ్య చెన్నూరు నాగేంద్ర ,కొత్తపల్లి నాగలింగం ,కడియాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు సుబ్బరాయునిలో అతిథి వసతి గృహ నిర్మాణమునకు ఒక లక్ష విరాళం..!

**..ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సురేష్ శర్మ.-ఆలయ ఈవో యం. రామక్రిష్ణ.**

**ఆంధ్ర ప్రగతి ఎస్.కొత్తూరు/పాణ్యం మార్చి 14:**
ప్రముఖ శైవక్షేత్రం లక్షలాది మంది భక్తుల ఆరాధ్య దైవమైన పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నందు భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న అతిథి వసతి గృహ నిర్మాణమునకు ఒక లక్ష రూపాయలు శనివారం భక్తులు విరాళంగా సమర్పించినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. నంద్యాల నూనెపల్లెకు చెందిన కే. చంద్రమోళి, నాగలక్ష్మి దంపతులకు శ్రీ స్వామివారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా 1 లక్ష విరాళంగా సమర్పించారు. వారికి ఆలయ మర్యాదతో అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి, శాలువాలు, పూలమాలలు, శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి, కంకణ ధారణ, ప్రసాదము,



స్వామివారి చిత్రపటమును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, నారాయణ శర్మ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, దాతల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు పాటించాలి : ఎస్సై మధుసూదన

**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల మార్చి 14:** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిరివెళ్ల ఎస్సై మధుసూదన కోరారు. వాహనదారులు రోడ్లపై వెళ్లేటప్పుడు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని ఎస్సై మధుసూదన చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ఇంటర్మీడియట్ పరీక్షలు అయినందున విద్యార్థులు సెలవులు ఉండడంతో వాహనాలతో రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ద్విచక్ర వాహనదారుడు రోడ్డుపై వెళ్లేటప్పుడు ఎలిమెంట్ పెట్టుకోవాలని సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని కారు నడిపేటప్పుడు సీటు బెల్టు తప్పకుండా పెట్టుకోవాలని చెప్పారు. పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులు ధైర్యంగా ఇష్టపడి శ్రద్ధతో సమయపాలన పాటిస్తూ పరీక్ష రాయాలని వారు కోరారు.



# పనితీరు మెరుగుపరుచుకుని జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలి

**ప్రతి శాఖ సమన్వయంతో లక్ష్యాల సాధనకు కృషి చేయాలి -ప్రజల సంతృప్తి శాతాన్ని మెరుగుపరచండి -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 14:**
జిల్లా సమగ్ర అభివృద్ధి సాధనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనితీరును మరింత మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సానుకూలత, ముఖ్య అభివృద్ధి సూచికలు, నియోజకవర్గాల ప్రత్యేక సమస్యలపై జిల్లాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.






### జిల్లా ర్యాంకింగ్‌లో ముందంజ
రాష్ట్రంలోని 28 జిల్లాలను పనితీరు ఆధారంగా నాలుగు వర్గాలుగా విభజించగా, నంద్యాల జిల్లా కాంపోజిట్ ర్యాంకింగ్‌లో 6వ స్థానంలో నిలిచి "లీడర్స్" కేటగిరీలో స్థానం సంపాదించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పురోగతిని మరింత వేగవంతం చేసి రాబోయే సమీక్షలలో ఇంకా మెరుగైన స్థానాన్ని సాధించేలా అన్ని శాఖలు కృషి చేయాలని సూచించారు.

### జిల్లా ఆర్థిక వృద్ధికి ప్రణాళికలు
రాష్ట్ర స్థాయి ఆర్థిక వృద్ధిలో నంద్యాల జిల్లా వాటాను పెంచేందుకు వివిధ రంగాల్లో సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. గతంలో జిడిపి సహకారంలో 22వ స్థానంలో ఉన్న జిల్లా ప్రస్తుతం 18వ స్థానానికి చేరుకోవడం ప్రగతిని సూచిస్తుందని పేర్కొన్నారు. రాబోయే కాలంలో జిల్లా ఆర్థిక వృద్ధిని మరింత పెంచే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు.ు

### వ్యవసాయ రంగంలో గణనీయమైన పురోగతి
జిల్లాలో వ్యవసాయ రంగంలో సానుకూల పురోగతి నమోదైందని కలెక్టర్ వివరించారు. వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం గత ఏడాది రూ.4,400 కోట్ల నుండి ఈ ఏడాది సుమారు రూ.7,500 కోట్లకు పెరిగినట్లు తెలిపారు. సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పెరగడంతో పాటు బీడు భూములను సాగులోకి తీసుకురావడం మరియు ద్విపంట సాగు ప్రోత్సాహం వంటి చర్యలు ఈ వృద్ధికి దోహదపడ్డాయని చెప్పారు.

### ఉద్యానవన రంగం అభివృద్ధి
ఉద్యానవన (హార్టికల్చర్) రంగం జిల్లాకు ముఖ్య ఆదాయ వనరుగా మారిందని, ప్రస్తుతం ఈ రంగం ద్వారా సుమారు రూ.7,000 కోట్ల ఆదాయం లభిస్తున్నట్లు తెలిపారు. రైతులకు అధిక లాభదాయక పంటలు, ఆధునిక సాగు విధానాలు మరియు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించి ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.

### ప్రజా సేవల నాణ్యతకు ప్రాధాన్యం
ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ప్రజలకు సులభంగా చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా పెన్షన్లు, రేషన్ పంపిణీ, సంక్షేమ సేవలు మరియు ప్రజా సేవల అమలులో పారదర్శకత, సమయపాలన, మర్యాదపూర్వక సేవలు అందించడంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

### ప్రజా సౌకర్యాల మెరుగుదల
రవాణా, రోడ్లు, ప్రజా రవాణా సదుపాయాలు, పౌరసరఫరాలు, అన్న క్యాంటీన్లు వంటి సేవల్లో సమయపాలన, పరిశుభ్రత మరియు సేవా నాణ్యతను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు అందించే సేవలు సమర్థవంతంగా ఉండేలా శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ప్రభుత్వంలోని 33 శాఖల పనితీరుపై ప్రజల అభిప్రాయాలను సేకరించినప్పుడు కొన్ని శాఖల్లో ప్రజల సంతృప్తి కేవలం 35 శాతం మాత్రమే వుందన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి అందిన గూగుల్ షీట్‌లో టాప్ 10 ఉత్తమ మరియు అత్యల్ప పనితీరు కనబరుస్తున్న శాఖల వివరాలు నమోదు చేయాలని సూచించారు. అలాగే ఎన్టీఆర్ భరోసా కింద జిల్లాలో సుమారు 2,16,000 మంది లబ్ధిదారులకు ప్రతి నెల దాదాపు రూ.100 కోట్ల మేర పెన్షన్లు పంపిణీ చేస్తున్నప్పటికీ, ప్రజల నుంచి 91 శాతం మాత్రమే సానుకూల స్పందన వస్తోందన్నారు. లోపాలను సరిదిద్ది ప్రజల సంతృప్తిని 98 శాతం పైగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సుమారు 90 శాతం మంది మాత్రమే రేషన్ తీసుకుంటున్నారని, మిగిలిన 10 శాతం మంది ఎందుకు రేషన్ పొందడం లేదో క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వలస వెళ్లిన వారు గుంటూరు వంటి ఇతర ప్రాంతాల్లో రేషన్ పొందే సౌకర్యం ఉన్నప్పటికీ, జిల్లాలో పంపిణీ శాతం తక్కువగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం రేషన్ పంపిణీపై ప్రజల సంతృప్తి స్థాయి 84 శాతం మాత్రమేఉందన్నారు. ఏపీఎస్ఆర్టిసి సేవల పనితీరును 90 శాతం కంటే ఎక్కువ స్థాయికి తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని రీజినల్ మేనేజర్ ను కలెక్టర్ ఆదేశించారు. అన్న క్యాంటీన్ల విషయంలో సమయపాలన, పరిశుభ్రత, వేడి ఆహారం వడ్డించడం వంటి అంశాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, నంద్యాలలో సెంట్రలైజ్డ్ కిచెన్ లేకపోవడంతో కర్నూలు లేదా కడప నుంచి ఆహారం రావడం వల్ల కొన్నిసార్లు వేడి తగ్గిపోవడం, వడ్డనలో ఆలస్యం జరుగుతున్నట్లు తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో క్యాంటీన్ల స్థలాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు. కేవలం రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో ఫీడ్‌బ్యాక్ రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా తక్కువ రేటింగ్ ఉన్న మొదటి 10 విభాగాలు (బాటమ్-10) మరియు 75 శాతం కంటే తక్కువ రేటింగ్ పొందిన శాఖలను గుర్తించి వాటి పనితీరును మెరుగుపరచాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపీఎస్ఆర్టిసి బస్ స్టేషన్లు, ఆర్ఓఆర్ సర్వే, పాట్‌హోల్స్, ట్రాన్స్‌పోర్ట్ ట్యాక్స్, వాహనం, యూరియా, ఇసుక, ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు సారథి సేవలు ఉన్నట్లు తెలిపారు. అలాగే మైనారిటీ వెల్ఫేర్, టెంపుల్ సర్వీసెస్, ఏసీ ఎండోమెంట్స్, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్, శానిటేషన్ (ఎంఏ & యూడీ), కాలేజియేట్ ఎడ్యుకేషన్, హౌసింగ్, రిజిస్ట్రేషన్స్ మరియు ప్రభుత్వ ఆసుపత్రులు కూడా తక్కువ పనితీరు కనబరుస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. తక్కువ రేటింగ్ పొందిన అన్ని శాఖలు తమ పనితీరును మెరుగుపరచి ప్రజల నుంచి సానుకూల స్పందన పొందేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

### విద్య మరియు సామాజిక రంగాలపై దృష్టి
పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, ఉపాధ్యాయుల హాజరు, బోధన నాణ్యత, విద్యార్థుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు మరియు ఇతర విద్యాసంస్థల్లో విద్యార్థుల అభ్యాస పురోగతిని తల్లిదండ్రులకు సమయానుకూలంగా తెలియజేయాలని తెలిపారు.

### శాఖల పనితీరు విశ్లేషణ
జిల్లాలోని వివిధ శాఖల పనితీరును కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ఆధారంగా విశ్లేషించి గ్రేడింగ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మంచి పనితీరు కనబరుస్తున్న శాఖలను అభినందిస్తూ, ఇతర శాఖలు కూడా ఉత్తమ ప్రమాణాలను సాధించేలా కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. జిల్లాలోని 50 శాఖల పనితీరును విశ్లేషించి వాటికి గ్రేడింగ్ ఇచ్చారని... సహకార, అటవీ మరియు ఆహార శుద్ధి శాఖలు అత్యల్ప పనితీరుతో 'జ' గ్రేడ్‌లో నిలిచాయన్నారు. మత్స్యశాఖ, సెకండరీ హెల్త్ మరియు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖలు 'దీ' గ్రేడ్‌లో ఉన్నాయని... మార్కెటింగ్, పశు సంవర్ధక, ఇంధన, ఇంటర్మీడియట్ విద్య, పౌరసరఫరాలు, ఫైనాన్స్, మైన్స్ అండ్ జియాలజీ, స్వచ్ఛాంధ్ర, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్, సాంకేతిక విద్య మరియు సాంఘిక సంక్షేమ శాఖలు 'ూా' 'ూా+' గ్రేడ్‌లలో నిలిచాయని కలెక్టర్ తెలిపారు.

### డేటా ఆధారిత పరిపాలన
పనితీరు అంచనాలకు సంబంధించిన మాస, త్రైమాసిక, వార్షిక డేటాను ఖచ్చితంగా నమోదు చేయాలని, అన్ని శాఖలు సమయానికి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

### ప్రజలతో అవుట్‌రీచ్ కార్యక్రమాలు
ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక అవుట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి అందిన లబ్ధిదారులనులను వివరించే కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత సమాచారం అందించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

# విద్యార్థులు నేర్చుకున్న టెక్నాలజీ మీ భవిషత్తు దిక్సూచి లాంటిది.

## ...విద్యార్థుల ఆలోచన ధోరణి మారిపోయింది.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 14:**
నంద్యాల పట్టణంలో ఐ బి ఎం నైపుణ్యాల శిక్షణా తరగతులు విద్యార్థులు నేర్చుకున్న టెక్నాలజీ వారి భవిష్యత్తుకు దిక్సూచి లాంటిదని,విద్యార్థుల ఆలోచన ధోరణి మారిపోయింది అని శ్రీ రామకృష్ణా విద్యా సంస్థల చైర్మన్ జి రామకృష్ణ రెడ్డి పేర్కొన్నారు.
నంద్యాల శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ముగిసిన ఐబీఎం మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ ముగింపు కార్యక్రమం విజయవంతం అయింది. తట్ట5టి5
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి .రామకృష్ణారెడ్డి ,కే.బీ.వి. సుబ్బయ్య కే .సంపత్ సర్ ఏం. ఇంతియాజ్ అహ్మద్ కె.దశరథ్ ,ఎం. భరత్ కుమార్ , టి.పవన్ , ఐ.అన్సారీ అధ్యాపకులు వెంకట్రావు గారు విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు.
ముందుగా కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్. ఎం. ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రియమైన విద్యార్థినీ విద్యార్థులు ఈ మూడు రోజుల ఐ బి ఎం స్కిల్స్ బిల్డ్ శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా మిమ్మల్ని ఉద్దేశించి మాట్లాడటం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ మూడు రోజుల పాటు మీరు నేర్చుకున్న ఐబీఎం నైపుణ్యాలు మిమ్మల్ని సాధారణ విద్యార్థుల నుండి పారిశ్రామిక అవసరాలకు తగ్గ అభ్యర్థులుగా మారుస్తాయి. ఐబీఎం వంటి అంతర్జాతీయ సంస్థలు అందించే ఈ జ్ఞానం మీకు గ్లోబల్ మార్కెట్‌లో ఒక గుర్తింపును ఇస్తుంది. ఈ సదస్సును ఏర్పాటు చేయడానికి వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం కూడా అదేనంద్యాల లాంటి ప్రాంతంలో ఉన్న మా విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కోవాలన్నదే మా ఆకాంక్ష. ఇంతటి గొప్ప అవకాశాన్ని మన విద్యార్థులకు కల్పించిన మన కళాశాల యాజమాన్యానికి, ముఖ్యంగా మన చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నతమైన కంపెనీల్లో స్థిరపడి మన కళాశాలకు మరియు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను అని అన్నారు. మీట్రైనింగ్ ఆఫీసర్ . దశరథ్ మాట్లాడుతూఈ మూడు రోజుల కార్యక్రమం ముగింపు కాదు, ఇది మీ అన్వేషణకు ఆరంభం మాత్రమే. నేర్చుకోవాలనే తపన మీలో ఉంటే, ప్రతిరోజూ ఒక కొత్త పాఠం నేర్చుకోవచ్చు. భవిష్యత్తులో మీరు కొత్త ఆవిష్కరణలు చేయాలి. ఆ ప్రయాణంలో అపజయాలు ఎదురైనా భయపడకండి, ఎందుకంటే ఆ అనుభవాలే మీకు గొప్ప పాఠాలను నేర్పుతాయి. ప్రయోగాలు చేసే ధైర్యం ఉన్నవారే రేపటి నాయకులు అవుతారు అని తెలిపారు. మరొక ట్రైనింగ్ ఆఫీసర్ ఐ. అన్సారీ మాట్లాడుతూ ఈ రోజు మీరు అందుకుంటున్న ఈ ఐబీఎం సర్టిఫికేట్ కేవలం ఒక కాగితం ముక్క కాదు. ఇది మీ అంకితభావానికి నిదర్శనం. ఒక ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు వందల మంది అభ్యర్థుల మధ్య మీరు ప్రత్యేకంగా కనిపించాలంటే, ఇలాంటి అంతర్జాతీయ స్థాయి శిక్షణలు మీకు తోడ్పడతాయి. మీ మేధస్సును పదును పెట్టడమే ఈ సదస్సు యొక్క ప్రాథమిక ఉద్దేశం. దీని ద్వారా పొందిన జ్ఞానాన్ని మీ వృత్తి జీవితంలో పెట్టుబడిగా మార్చుకోండి అని తెలిపారు.






**ఎం. భరత్ కుమార్ మాట్లాడుతూ (శిక్షకులు)**
"మేము మీకు మార్గాన్ని చూపించాము, కానీ ఆ మార్గంలో నడవాల్సింది మీరే. సమాజంలో ఆటోమేషన్ పెరుగుతున్న కొద్దీ సంప్రదాయ ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి, అదే సమయంలో నైపుణ్యం కలిగిన వారికి వేల సంఖ్యలో కొత్త అవకాశాలు పుట్టుకొస్తున్నాయి. బయటి ప్రపంచం చాలా వేగంగా ఉంది, మీరు గది దాటి బయటకు వచ్చినప్పుడు ఆ వేగాన్ని అందుకోవాలి. మీ ఆలోచనా విధానమే మీ గమ్యాన్ని నిర్ణయిస్తుంది. నిరంతరం నేర్చుకునే తత్వాన్ని అలవాటు చేసుకోండి అన్నారు.
లికే.బి.వి. సుబ్బయ్య కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ "ప్రస్తుతం మనం నాలుగవ పారిశ్రామిక విప్లవంలో ఉన్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఒక సాధనం మాత్రమే కాదు, అది ఒక అనివార్యమైన శక్తి. భవిష్యత్తులో ఏ రంగంలోనైనా ఉద్యోగం సాధించాలంటే కృత్రిమ మేధస్సుపై కనీస అవగాహన ఉండటం తప్పనిసరి. ఈ ఐబీఎం శిక్షణ మీకు ఆ పునాదిని వేసింది. టెక్నాలజీని చూసి భయపడకండి, దాన్ని మిత్రునిగా మార్చుకుని మీ వృత్తిని మెరుగుపరుచుకోండి. ఈ శిక్షణ మీ కెరీర్‌కు ఒక కొత్త దిశను చూపుతుందని నేను ఆశిస్తున్నాను అని తెలిపారు.
ముగింపు సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ ఐబీఎం మరియు మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ ముగింపు వేడుకకు విచ్చేసిన అతిథులకు, అధ్యాపక బృందానికి మరియు నా ప్రియమైన విద్యార్థులకు వందనాలు.
గత మూడు రోజులుగా మన కళాశాల ఆవరణలో ఒక వైజ్ఞానిక యజ్ఞంలా సాగిన ఈ శిక్షణా కార్యక్రమం ఇంత విజయవంతంగా ముగియడం చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది. ముందుగా, మన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను అందించడానికి విచ్చేసిన ఐబీఎం నిర్వాహకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.
విద్యార్థులారా, మారుతున్న కాలంతో పాటు మనం కూడా మారాలి. ఒకప్పుడు డిగ్రీ పూర్తయితే ఉద్యోగం గ్యారెంటీ అనే పరిస్థితి ఉండేది. కానీ నేడు ప్రపంచం మారిపోయింది. ఇప్పుడు కంపెనీలు 'మీకు ఎన్ని మార్కులు వచ్చాయి?' అని అడగడం లేదు, 'మా కంపెనీ సమస్యలను పరిష్కరించే ఏ నైపుణ్యం మీ దగ్గర ఉంది?' అని అడుగుతున్నాయి. ఈ ప్రోగ్రామ్ మీకు ఆ సమస్యలను పరిష్కరించే ఆయుధాలను అందించింది. ప్రపంచంలో అత్యంత విలువైన వనరు 'సమయం'. ఈ మూడు రోజులు మీరు మీ సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే కొన్నిటిని వదులుకోవాలి. స్నేహితులతో కాలక్షేపం, అనవసరమైన వినోదాలను మీరు ఈ మూడు రోజులు త్యాగం చేశారు కాబట్టే, ఈ రోజు ఒక గొప్ప జ్ఞానాన్ని సంపాదించుకోగలిగారు. మీరు చేసే ఈ త్యాగమే మీ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుంది.
మన శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎప్పుడూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉంటుంది. మీకు ఏ రకమైన సాంకేతికత కావాలన్నా, ఏ విధమైన సదస్సులు నిర్వహించాలన్నా నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నాను. భవిష్యత్తులో ఐటి రంగంలో వచ్చే మార్పులను తట్టుకోవడానికి మీకు మరిన్ని స్కిల్ డెవలప్‌మెంట్ క్లాసెస్ నిర్వహిస్తాం. తెలివితేటలు ఎవరికీ పుట్టుకతోనే రావు, అవి సాధనతో వస్తాయి. ఈ సర్టిఫికేట్‌ను మీ ఫైల్‌లో దాచుకోకండి, ఇందులో నేర్చుకున్న అంశాలను మీ నిత్య జీవితంలో, మీ ప్రాజెక్ట్‌లలో ఉపయోగించండి. అప్పుడే ఈ కార్యక్రమానికి పూర్తి సార్థకత లభిస్తుంది. మీ అందరికీ ఉజ్వల భవిష్యత్తు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని విద్యార్థులను ఉత్సాహ పరిచారు. కి. సంపత్ కుమార్ మాట్లాడుతూ
వేదికపై ఉన్న పెద్దలకు మరియు నా ప్రియమైన విద్యార్థులకు నమస్కారం.గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ ఐబీఎం స్కిల్స్ బిల్డ్ శిక్షణ కార్యక్రమం ఒక అద్భుతమైన ముగింపు దశకు చేరుకుంది. ముందుగా మన కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు. ఎందుకంటే, విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండా, అంతర్జాతీయ స్థాయి సంస్థలతో అనుసంధానం చేస్తూ ఇలాంటి నైపుణ్య శిక్షణలు అందించాలనే ఆయన విజన్ నిజంగా అభినందనీయం. నేడు 'కృత్రిమ మేధస్సు' ద్వారా అది సుసాధ్యం అవుతోంది. ఈ మార్పును చూసి మనం భయపడకూడదు, దానికి తగినట్లుగా మనం మారాలి. ఈ మూడు రోజులు మీరు నేర్చుకున్న టెక్నాలజీ అనేది మీకు ఒక దిక్సూచి వంటిది.
ముందుగా ఈ ప్లాట్‌ఫారమ్‌ను కల్పించిన మన కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి అడుగడుగునా ప్రోత్సహించిన ప్రిన్సిపల్ కె.బి.వి. సుబ్బయ్య డైరెక్టర్ డా.+. హేమంత్ రెడ్డి నా హృదయపూర్వక ధన్యవాదాలు.
తమ అమూల్యమైన సమయాన్ని కేటాయించి, విద్యార్థులకు ఎంతో ఓపికగా నైపుణ్యాలను నేర్పించిన ఐబీఎం మ్యాజిక్ బస్ శిక్షకులు ఎం. భరత్ కుమార్ ఐ. అన్సారీ ఇతర ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు. మీ బోధన మా విద్యార్థుల ఆలోచనా ధోరణిని మార్చింది. ఈ వేడుకకు విచ్చేసి తమ స్ఫూర్తిదాయక ప్రసంగాలతో విద్యార్థులను ఉత్తేజపరిచిన కె. సంపత్ కుమార్ , కె. దశరథ్ ఇతర ప్రముఖులందరికీ ధన్యవాదాలు.
ఈ మూడు రోజులు కార్యక్రమం ఎటువంటి ఆటంకం లేకుండా జరగడానికి సహకరించిన టెక్నికల్ టీమ్ ప్రో టీం సిబ్బందికి, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు. చివరగా, ఎంతో క్రమశిక్షణతో ఈ శిక్షణలో పాల్గొని, దీనిని విజయవంతం చేసిన నా ప్రియమైన విద్యార్థులందరికీ అభినందనలు. మీరు పొందిన ఈ జ్ఞానం మీ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను అని తెలిపారు.
ఈ సదస్సుకు హాజరైనటువంటి ముఖ్య అతిథులకు కళాశాల యజమాన్యం వారు ఎంతో ఘనంగా సన్మానించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం15 మార్చి 2026

## మార్కెట్ యార్డులో మౌలిక వసతులు కల్పించాలి.

**గొర్రెల కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలి. - సిపిఐ బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య.**


**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె మార్చి 14:**



బనగానపల్లె మార్కెట్ యార్డులో తాగునీటి సదుపాయం మరుగుదొడ్లు నిర్మించాలి దాదాపుగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి బనగానపల్లె గొర్రెల సంతకు అన్ని ప్రాంతాల నుంచి బనగానపల్లెకు వస్తారు. ఒక్కొక్క గొర్రెకు మేకకు 30 రూపాయలు వసూలు చేస్తున్నారు అయినా అక్కడ కనీస వసతులు లేవు ఎంతో మంది స్త్రీలు పురుషులు ఈ సంతకు కొనుగోలుదారులు వస్తూ ఉంటారు. సిపిఐ గా విజ్ఞప్తి చేస్తా ఉన్నాం వసతులు కల్పించాలి అలాగే వర్షాకాలం రాబోతుంది వ్యాపారస్తులు రైతులు కొనడానికి అమ్మడానికి ఇక్కడికి వస్తారు వర్షం వచ్చినప్పుడు వ్యాపారి తీవ్రంగా నష్టపోతున్నాడు. ఒక వ్యాపారి నష్టపోతే పదిమంది గొర్రె కాపరులు నష్టపోతారు. ఎందుకంటే ఆ డబ్బు చెల్లించలేడు కాబట్టి సిపిఐ గా విజ్ఞప్తి చేస్తున్నాం అక్కడ రేకుల షెడ్లు నిర్మించాలని అలాగే నియోజక వర్గం లో చాలా మంది గొర్రెలు మేకలు పొట్టేలు వీటిపైనే ఆధారపడి ఉంటారు గత ప్రభుత్వాల్లో గొర్రెల లోన్లు ఇచ్చేవి ఆ స్కీం కింద 20 గొర్రెలు ఒక పొట్టేలు ఇచ్చేది ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆ స్కీమ్ తేవాలని విజ్ఞప్తి చేస్తున్నాం శాసనసభ్యులు ఆర్ అండ్ బి శాఖామంత్రి శ్రీ జనార్ధన్ రెడ్డి గారికి గొర్రెల కాపరుల ద్వారా విజ్ఞప్తి నియోజకవర్గంలో ఉన్నటువంటి గొర్రెల కాపరులను ఆదుకోవాలని సిపిఐ విజ్ఞప్తి చేస్తున్నాం ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు సుబ్బారెడ్డి మండల సమితి సభ్యులు శివ నాగయ్య సుబ్బయ్య నరసమ్మ రమేష్ మౌల తదితరులు పాల్గొన్నారు.

## అహోబిల మఠం నూతన సీఏఓ వేణుగోపాల స్వామిని కలిసిన నంద్యాల మార్కెట్ ప్రసాద్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 14:**



శ్రీ అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆదేశానుసారం అహోబిలం మఠం నూతన ముఖ్య కార్యనిర్వహణాధికారిగా (సీఏఓ) బాధ్యతలు స్వీకరించిన కేపీ వేణుగోపాలన్ (కేపీ రమేష్) స్వామిని నంద్యాల పట్టణానికి చెందిన ప్రముఖుడు మార్కెట్ ప్రసాద్ శనివారం గౌరవపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన స్వామివారికి మార్కెట్ ప్రసాద్ శుభాకాంక్షలు తెలియజేసి, శాలువా సమర్పించి సత్కరించారు. అహోబిలం మఠం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆధ్యాత్మిక, ధార్మిక సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు మఠం అభివృద్ధి చెందాలని కోరుకున్నారు.అహోబిలం మఠం వైభవం దేశవ్యాప్తంగా మరింత విస్తరించాలని, మఠం చేపడుతున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మార్కెట్ ప్రసాద్ తెలిపారు.స్వామివారిని మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఆధ్యాత్మిక అంశాలపై వారు పరస్పరం చర్చించుకున్నారు.

# గురురాజాలో అట్టహాసంగా ప్రీ నర్సరీ ముగింపు వేడుకలు.








**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 14:**
నంద్యాల పట్టణం లోని ఎన్జీవో కాలనీలో ఉన్న శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులకు ప్రీ నర్సరీ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు వేడుకలకు శ్రీ గురురాజా పాఠశాల సలహాదారులు శ్రీమతి పి. సింధు, శ్రీమతి పి. రేవతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రీ నర్సరీ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారుల విచిత్ర వేషధారణలు, దేశ నాయకుల ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్ స్టోరీస్, నంబర్ గేమ్స్, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, ఫ్యాషన్ షోలు ఇలా వివిధ రకాల కార్యక్రమాలతో విద్యార్థుల ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ఆడుతూ, పాడుతూ ప్లే వే మెథడ్ లో యాక్టివిటీ బేస్డ్ విధానంలో ప్రీ నర్సరీ ఉపాధ్యాయుల శిక్షణ అందించగా విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి స్కూల్ గౌరవ సలహాదారులు శ్రీమతి సింధు గారు, శ్రీమతి రేవతి గారు ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల ప్రతిభ పాటలను అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.









## శ్రీశైలంలో జరుగనున్న ఉగాది బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత.

**క్యూలైన్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ.**

**భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించండి.**

**భక్తులకు పోలీస్ వారి సూచన అనుసరిస్తూ సురక్షితంగా దైవదర్శనం చేసుకోవాలని విజ్ఞప్తి.**

**..జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.**





**ఆంధ్ర ప్రగతి శ్రీశైలం మార్చి 14:**
శ్రీశైల క్షేత్రం నందు జరగనున్న ఉగాది బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి విచ్చేయు లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగింది.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. దేవస్థానం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వివిధ నుండి క్యూ లైన్లు పరిశీలించి భక్తుల భద్రత కొరకు అధికారులకు పలు సూచనలు చేశారు.
అలాగే గుడి వెలుపల ఉన్న క్యూ లైన్ల నుండి అమ్మవారి దర్శనం అనంతరం నిష్క్రమణ వరకు ఏర్పాటైన మార్గాలను తనిఖీ చేశారు.
భద్రత పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి భక్తుడిని గుడి ప్రవేశ మార్గం నందు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రధాన ద్వారం నుండి దర్శనం అనంతరం నిష్క్రమణ మార్గాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.
విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి తెలిపారు.
భక్తులకు పోలీస్ వారు సూచించే మార్గనిర్దేశాలను అనుసరిస్తూ సురక్షితంగా దైవదర్శనం చేసుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా పాల్గొన్నారు.

## ఒక్కరూపాయికి కడుపునిండా భోజనం..!

**.. నంద్యాల బ్లడ్ సెంటర్ నిర్వాహకుడు బ్లడ్ అచ్చు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 14:** నంద్యాల పట్టణంలో గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలు ఆర్థిక సహాయ సహకారాలు ఒక్క రూపాయికే కడుపు నిండా కమ్మని భోజనం అందించడం అద్భుతం,ఎంతో మందికి ఆదర్శ ప్రాయమని అభినందించిన నంద్యాల బ్లడ్ నిర్వాహకులు బ్లడ్ అచ్చునంద్యాల నియోజకవర్గంలోని గడిచిన నాలుగు నెలల నుండి నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త,సామాజికవేత్త గోళ్ళ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలు,ఆర్థిక సహాయ సహకారాలు,కౌలు రైతులను ఆదుకోవడం, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల 2000 వేల ఆర్థిక సాయం అందించడం,నిరుద్యోగులకు నిరుద్యోగ వికాస భృతి అందించడం,జర్నలిస్టులకు ఆర్థిక భరోసా, ఒక రూపాయికే పుల్కాలు,కలర్ రైస్, కర్రీ, ఒక్క రూపాయికే జొన్న రొట్టె,పప్పు, ఒక్క రూపాయికే కడుపు నిండా కమ్మని భోజనం అందించడం లాంటి పలు సేవా కార్యక్రమాలకు గడిచిన నాలుగు నెలల నుండి తాను గమనిస్తున్నానని ఈరోజు తన సొంత పనిమీద వెళుతూ ఒక్క రూపాయికే భోజనం అందిస్తున్న గోళ్ళ రాజేష్ ఫుడ్ పాయింట్ వద్దకు వచ్చినటువంటి నంద్యాల బ్లడ్ నిర్వహకులు బ్లడ్ అచ్చు మరియు వారి సిబ్బంది ఒక్కరుపాయికే భోజనం అందిస్తున్నటువంటి విషయం తెలుసుకొని చాలా సంతోషం వ్యక్తం చేశారు.అక్కడ భోజనం చేస్తున్న కొంతమందితో స్వయంగా బ్లడ్ అచ్చు మాట్లాడి వారు భోజనం బాగుందని చాలా రుచిగా ఉందని చెప్పడంతో బ్లడ్ అచ్చు సంతోషం వ్యక్తం చేసశారు.ఈ సందర్భంగా నంద్యాల బ్లడ్ నిర్వహకులు బ్లడ్ అచ్చు మాట్లాడుతూ నంద్యాల జిల్లా హెడ్ క్వార్టర్ గా ఉన్న నేపథ్యంలో ఎంతో మంది తమ సొంత పనుల నిమిత్తం నంద్యాల కి వస్తా ఉంటారు అటువంటి వారికి కేవలం ఒక్క రూపాయి కమ్మని కడుపునిండా భోజనం అందించడం చాలా సంతోషకరమని ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో ఇప్పటికే గోళ్ళ రాజేష్ 4 నెలల నుండి నిరంతరంగా కొనసాగించడం చాలా అభినందించ తగ్గ విషయమని, ఇది సేవా కార్యక్రమాలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని బ్లడ్ అచ్చు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంద్ బాషా, కలాం, నాగమ్మ, నంద్యాల బ్లడ్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 15 ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం వారోత్సవాలు.






**ఆంధ్ర ప్రగతి డోన్ మార్చి 14:** డోన్ అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంతియాజ్ భాష అధ్యక్షతన డోన్ తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు పరిరక్షణ పై అవగాహణ కరపత్రల అవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం పై జాగృతి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది అదేవిధంగా రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్ వారు ఆహార తినుబండారాలలో ఏ విధమైన కల్తీలు జరుగుతున్నాయి వాటి వల్ల వినియోగదారులు జాగృతి పొందాలని వాల్పోస్టర్లను పంపించడం జరిగినది. ఆ వాల్ పోస్టర్లను డోన్ అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంతియాజ్ భాష చేతుల మీదుగా ఆవిష్కరణ గావించి రేపు ఆదివారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం వినియోగదారులు హాజరు కావాలని సివిల్ సప్లై డిపార్ట్మెంట్ వారు పంపించిన ఫ్లెక్సీని ఆవిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్ హాజరు కావడం జరిగినది. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మార్కెట్లో తినుబండాలు అన్నియు రసాయనిక పదార్థాలు కలిపి తయారు చేస్తున్నారని వాటిని వినియోగదారులు కనుక్కొని జాగ్రత్త పడాలని ఆయన తెలియజేశారు.బన్నులు,కేకులు తదితర రసాయనిక పదార్థాలు కలిపి రంగు వచ్చే విధంగా తయారు చేస్తున్నారని వాటిని తినడం వలన క్యాన్సర్ వ్యాధికి గురవుతున్నారని వాటిని వినియోగదారులు తిరస్కరించాలని ఆయన తెలియజేశారు. డోన్ వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ అరటి పండ్లు, మామిడిపండ్లలో కార్బైడ్ ద్వారా మగ్గపెట్టి వినియోగదారులకు అమ్ముతున్నారని వాటిని తినడం వలన కిడ్నీ వ్యాధులు, కాలేయ వ్యాధులు తదితర వ్యాధులు వస్తున్నాయని వెంటనే సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు వాటిపై పర్యవేక్షణ చేసి వినియోగదారులకు రక్షణ కల్పించాలని వారు కోరారు. అలాగే వినియోగదారుల సంఘం ద్వారా డోన్ అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంతియాజ్ భాష గారిని డోన్ తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం తరుపున డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్,వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి లు ఘణంగా సన్మానించారు.

## గోసంరక్షణతోనే దేశ పురోగమనం.

**డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తితిదే.**



**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు మార్చి 14:**
గోసంరక్షణతోనే దేశ పురోగమనం ఆధారపడి ఉంటుందని, దేశానికి గోవు మూలాధారమని, గో సంరక్షణతో సకలైశ్వర్యాలు సాధించవచ్చని, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని శ్రీ రుక్మిణి పాండురంగస్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మూడురోజులపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సి. హెచ్.వి. రాజారెడ్డి శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ప్రవచనాలు, మల్యాల, తూడిచర్ల నుండి వెంకట రమణ, సోమన్న బృందాలు చేసిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారమండలి సభ్యులు అంబటి శివశంకర రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బి.వెంకోజి రావు, కోశాధికారి యం. సత్యనారాయణ రావు, అర్చకులు శ్రీధర్, యం. జయగౌరి, జి. కృష్ణారావు, భవాని కుమార్, జి. నాగరాజు, ఎన్. వెంకటరావు, జి. మోహనరావు, యం. కృష్ణ, పి. రామారావు, బి.రఘునాధరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘు రామాచార్యులు, మాకా శేషయ్య, ఎల్. ఐ. సి. రామకృష్ణారెడ్డి, రమణ, సాయిరాం విద్యాసంస్థల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, సుధాకర్ రెడ్డి, డాక్టర్ మోక్షేశ్వరుడు, ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు లక్ష్మన్న, శివారెడ్డి, రమేశ్ రెడ్డి, ఎన్ లక్ష్మీబాయ్, జి.నాగమణి బాయ్, ఎస్.లక్ష్మి, ఎస్.జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పన్నులు సకాలంలో చెల్లించండి:డీపీఓ





**ఆంధ్ర ప్రగతి మహానంది మార్చి 14:**
సకాలంలో పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారిని కే.లలితా భాయి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో పలు ఇళ్లు, దుకాణాలకు వెళ్లి యజమానులతో మాట్లాడారు. బకాయిల చెల్లింపులో జాప్యం జరిగితే పంచాయతీ అభివృద్ధి ఎలా కుంటుపడుతుందో వివరించారు. పంచాయతీ సిబ్బందికి సహకరించి పన్నులు సకాలంలో చెల్లించాలని వారికి సూచించారు.గడువులోగా పన్నులు వసూళ్లు తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవి లత, సిబ్బంది పాల్గొన్నారు.